# ఏమైపోయారో?

**"పాట్లూరి"**

"ఏమండీ!" అంటూ ఎవరో పిలిచేసరికి, నిద్రమంచుకొస్తున్నా నిద్రపోవడానికి వీల్లేక, కూర్చునే కునికిపాట్లతో తృప్తిచెందుతున్న నేను, ఉలిక్కిపడి కళ్లువిప్పి చూచాను.

"దయచేసి ఇక్కడ కూర్చోనిస్తారా?" అని ఎదురుగా పాతికేళ్ళ యువకుడు, కళ్లల్లో జాలి దృక్కులు బరపుతూ, అడిగేసరికి నిద్రచెడగొట్టాడనే బాధ కనీసం ఛాయామాత్రంగానైనా నాలో పొటమరించలేదు. పైగా అతని లావణ్యం, చూపుల్లో సౌహార్ద్రిత అతని అభ్యర్థనను నాచే తిరస్కరింపచేయకుండా చేసినై.

"కూర్చో" అని నా కాళ్ళు కొంచెం దగ్గరకు లాక్కుని కుంచించుకుని కూర్చున్నాను. ఆ అబ్బాయి ఉన్నంతలోనే వీలుచేసుకొని ఇరుక్కొని కూర్చున్నాడు. అతని అవస్థ చూచి నేను మరికొంత చోటిచ్చాను.

"ఏం స్టేషన్?"

"బెజవాడ."

"ఎందాకా వెళ్తున్నారు?"

"మద్రాసు."

"అబ్బా! చాలాదూరం వెళ్ళాలి; నేనూ అక్కడికే లెండి. వెధవ ట్రైను. చాలా లేటయి వచ్చింది. మద్రాసు చేరేటప్పటికి మధ్యాహ్నం ఏ రెండో మూడో అవుతుంది. మధ్యలో మళ్లీ ఏజబ్బూ చేయకుండావుంటే పదిగంటలు పడుతుందనుకుంటాను."

అవునన్నట్లు తల ఊపాడు ఆ అబ్బాయి.

నేను మళ్ళీ నిద్రపోదామనిపడుకున్నాను. కాని, కాళ్ళు జాపుకోడానికి చోటులేకపోవడంచేత పట్టే పట్టే నిద్ర భంగమవడంచేత మొత్తంమీద నిద్రపోవాలని ఎంత ప్రయత్నించినా నిద్రపట్టలేదు. ఆ అబ్బాయి వంక చూసే అతనికీ నిద్రాదేవిక చాలాదూరమున్నట్లనిపించింది.

"చదువుకుంటున్నారా?"

"లేదండి. లాయర్ను ప్రాక్టీసు మొన్న మొన్ననే ప్రారంభించాను."

"నిజం? చాలా చిన్నగా అవుపిస్తున్నారు? మీవయస్సెంతా?"

"పాతికసంవత్సరాలు, ఈ తరంవాళ్ళలో నలభై, యాభై ఏళ్ళువచ్చినా, కొందరుపాతికేళ్ళ వాళ్లలావుండటం, పాతికేళ్ళ వాళ్లు వెంట్రుకలు నెరిసిపోయి, నలుగురైదుగురు పిల్లల్ని కనేటప్పటికి, యాభై ఏళ్ల వాళ్ల మాదిరి అగుపించడం సహజంగానే ఉందిగదండీ!"

"అలాటి ప్రత్యేకతలు మాలో ఏమీ అవుపించడంలేదే" ఒకటి రెండుక్షణాలు మౌనంగా ఉండిపోయాం ఇద్దరం. కాని నేను మాత్రం అతనివంక పరిశీలనగా చూస్తూ, నా అభిప్రాయం నిజమేనన్న భావాన్ని సమర్థించుకోవచ్చు ననుకున్నాను. "పెట్టె బేడా ఏమీ లేవేమిటి? మీసామాను ఎక్కడ పెట్టారు?" అని నిశ్శబ్దాన్ని భగ్నంచేస్తూ అడిగాను.

"ప్రక్కనేఉన్న ఆడవాళ్ల పెట్టెలో పెట్టాను. ఇక్కడ ఇంత ఒత్తిడిగా ఉన్నప్పుడు, నిద్రపోవటానికి చోటుదొరకదన్నట్టుండటంవల్ల బెడ్డింగుమాత్రం ఎందుకులే అని అక్కడే పెట్టేశాను."

అతని నిస్సహాయస్థితి చూచేసరికి నాకు జాలివేసింది. నాస్థానంలో అతణ్ణి నిద్రపోవలసిందని ఆహ్వానించాను. కృతజ్ఞతాంజలి సమర్పిస్తూ, నా బెడ్డింగుపై నిద్రపోవటానికి అంగీకరించాడు. అమృతకలశ మే హస్తగతమైనంత ఆనందపరవశుడయ్యాడు.

తరువాత కొంచెంసేపటికి నేను అతని ప్రక్కనే ఒదిగిపడుకున్నాను. ఎలాగో ఇద్దరం ఇరుకుగా ఫీలవుతున్నా సర్దుకోగలిగాం.

రైలు వేగంగా దూసుకుపోతుంటే, ఆవేగానికి తట్టుకోలేక భయంతో వెనకదాక్కోజూచే గాలి, శరణంటూ మా దగ్గరకు రావడంవల్ల, ఆ గాలి జోలపాట జోరు కావడంతో నిద్రలో మునిగిపోయాం.

మరునాటి ఉదయం బిట్రగుంటలో బండి ఆగేసరికి నాకు నిద్రమెలుకువ వచ్చింది. లేచిచూస్తే, నా ప్రక్కన పడుకున్న లాయరు అక్కడలేడు. ముఖం కడుక్కుందామని క్రిందకు దిగాను. ప్రక్కన లేడీస్ కంపార్టుమెంటుదగ్గర ఒకయువతితో లాయరుమాట్లాడుతూ ఉండటం చూచాను. ఎట్టి శరీరచ్ఛాయ! చెంపకు చారెడేసికళ్లు. సగం వికసించిన గులాబిరేకులవంటి సన్నటి పెదవులు; సుంద్రని ముఖం; రవికచాలని వక్షస్సౌందర్యం; సన్నని తెల్లని బియ్యపుగింజల్లాంటి పండ్లు; పసుపుపచ్చగానిగనిగలాడే బుగ్గలు; అపురూప సుందరి. పంపుదగ్గర నించుని ముఖం కడుగుతున్నంతసేపూ ఒకకన్ను అటుకేసి ఉంచాను. తర్వాత ఆమెను మాడాలనిటీ తాగాలనె నెపంతో అటూఇటూ రెండుమూడుసార్లు తిరిగాను వెళ్తూ, వెళ్తూ. వాళ్లిద్దరూ మాట్లాడుకుంటున్న చోటుకు దగ్గరగా, వాళ్లు నన్ను చూడాలనీ, ఆ లాయరు నన్ను పిలిచి, ఆమెను ఫలానా అని పరిచయం చేయాలన్న అభిలాషతో కొంచెం నెమ్మదిగా నడవసాగాను.

ఆమె ఎవరో! లాయరు నన్ను పిలిచి పరిచయంచేస్తే బాగుండు ననిపించింది కాని ఆమెతో సంభాషిస్తూ బయటిప్రపంచాన్నే మరచిపోయాడు.

ఆమె చాలా అందంగా ఉంది.

రాత్రంతా నిద్రలేకపోవడం మూలంగా కాబోలు కళ్ళు లోతుకుపోయి, మనిషి కొంచెం నీరసంగా కనిపిస్తోంది. కానీ కళ్ళు



మాత్రం గుండ్రంగా, అమావాస్యనాటి నీలాకాశంపై వేగుచుక్క లన్నట్లు కాంతివంతంగా ఉన్నాయి.

నా ఆశ అడియాస అయింది. లాయరు నన్ను పిలవలేదు. ఆమె ఎవరో నాకు పరిచయం చేయలేదు. బండి బయలుదేరే టైము అయింది. గార్డు విజిల్ వేశాడు. నేను తిరిగి కంపార్టుమెంటులోకి ఎక్కాను. కంపార్టుమెంటు దగ్గరకొచ్చి వేడి వేడి టీ అని అరుస్తూంటే, ఒక టీ తీసుకున్నాను. అంతలోకి లాయరు గబ గబా కంపార్టుమెంటులోకి వచ్చాడు. పరిగెత్తుకొచ్చాడల్లే ఉంది. రొప్పుతున్నాడు.

"టీ తీసుకుంటారా" అని అడిగాను ఆయన్ని.

"ఆ! తీసుకుంటా...థాంక్స్. కొద్దిగా చాలండి అబ్బ...ఎంతరద్దీగా ఉందండి బండంతా..."అని అలసట తీర్చుకుంటూ, చెమట తుడుచుకుంటూ అన్నాడాయన.

"అవును, చాలారద్దీగా వుంది...పాపం.." మీ...మీఆవిడగార్కి ఇబ్బందేం లేదుగదా" అని టీ అందిస్తూ అడిగాను.

"థాంక్స్," అని టీ ఇచ్చినందుకు కృతజ్ఞత తెలిపాడు. మళ్లీ వెంటనే తెలివితెచ్చుకొని, "సారీ...ఆమె నాభార్యకాదు", అని నాతప్పు వ్యాఖ్యానాన్ని ఖండించాడు.

"ఓ, సారీ..." అని తప్పుగా వ్యాఖ్యానించినందుకు ఫీలవుతూ టీ కప్పులోకి తొంగి చూచాను.

కాని నాలో ఆమె ఎవరో తెలుసుకోవాలన్న ఆత్రుత హెచ్చింది. ఆమె ఎవరో? ఆమెకు లాయరుకూ బంధుత్వం ఎలాంటిది? అసలు అతన్ని డైరెక్టుగా అడిగేద్దామనిపించింది. కాని సభ్యతకు విరుద్ధమనిపించుకుంటుందేమోనని సందేహించి ఊరుకున్నాను. అలా అడగడమే తటస్థిస్తే నేనెందుకు అంత ఆతృతగా ఉన్నానో అతడూహించగలుగుతాడు. ఆ అమ్మాయి రూపలావణ్యాలు నన్ను ముగ్ధుణ్ణి చేశాయి. అందులో ఏమాత్రం సందేహంలేదు.

ఆమె అతని భార్యకాదు, పోనీలే... అదొక శుభసూచన అనుకున్నాను. ఆశ నిర్జీవం కాకపోవడం శుభసూచన కాదూ మరి? ఆమెకూ అతనికీ బాంధవ్యమెట్టిదో తెలుసుకోడానికి అన్యమార్గం ఆలోచించాలి.

# ఆమె ఎవరో?

"బెజవాడనుంచే వస్తున్నారా?"

"అవును."

"అక్కడే ప్రాక్టీసు చేస్తున్నారా? బంధువుల్ని చూడ్డానికి వెళ్ళి వస్తున్నా రనుకుంటాను?"

"కేవలం చూడ్డానికనే కాదులెండి."

ఓరి భగవంతుడా! ఎక్కడి మనిషో, ఈ లాయర్ అనిపించింది. ఏదడిగినా పుల్లవిరిచినట్లే చెపుతాడుగాని, ఆ అమ్మాయిని గురించి రవంతయినా సమాచారం అందచెయ్యడంలేదు. ఇంకెలా?...

"పెళ్ళికేమయినా...?"

"అవును."

"అవును. పెళ్ళిళ్ళరోజులేగా. మీరు, మీ చెల్లాయి కలిసి పెళ్ళికెళ్ళి వస్తున్నా రన్నమాట."

"అవును. పెళ్ళినుంచే వస్తున్నాము కాని. ఆమె నా చెల్లాయికాదు."

చచ్చాం. చెల్లాయి కాదట. చెల్లాయి కాకపోతే ఎవరో ఏమిటో చెప్పగూడదూ? పోనీ చెల్లాయికాదు; భార్యకాదు; మరెవరు? ఎవరో తెలుసుకోవాలనే ఆకాంక్ష నాలో అధికమైంది. ఆమె ఎవరో తెలుసుకోగల్గాలి. లేకపోతే పిచ్చెక్కి పోయేటట్లుంది. చెల్లాయీ కాదు; భార్యా కాదు; మరెవరు? ఏదడిగినా వ్యతిరేక సమాధానం చెప్తున్నాడు. పోనీ నన్నట్లా ఏడిపించకపోతే తన కేమవుతుందో చెప్పెయ్యగూడదూ?

"మీ ప్రాంతాల్లో ఆడవాళ్ళు ఎక్కువమంది చదువుకుంటుంటారా? మీవదినగారు ఇంగ్లీషుపత్రిక చదువుతూవుండటం చూశానండి."

"ఇతర ప్రాంతాలవాళ్ళతో తలుచుకుంటే మా ప్రాంతాల్లో ఆడవాళ్ళలో చదువుకోవడం తక్కువే. ఒకవేళ చదువుకున్నా ఇంగ్లీషు చదివేవాళ్ళు మరీ తక్కువ."

"అబ్బే, అందుక్కాదు. మీ వదినెగారి చేతిలో ఇంగ్లీషు మాగజైను ఉంటేనూ...."

"ఆమె మా వదినెగారు కాదండి."

"ఓ...సారీ...."

అని త్వరపడి అన్నందుకు ఏమీ అనుకోకండన్నట్లు సముదాయించుకున్నాను. ఆమె ఎవరో తెలుసుకోవడం దుర్లభమనుకున్నాను. ఇక అడగడం మానేయాలి. లేదా అడగకూడని సంబంధమేదో ఉండి ఉండాలి. అంతేగా మరి? స్త్రీ పురుషులమధ్య ఉండే సంబంధ బాంధవ్యాలను తెలుసుకోవడం చాలా కష్టమైన సమస్య. అలా అని ఊరుకుందామనుకున్నా మనస్సు ఊరుకోనిస్తుందా?...ఏం చెయ్యడం? మళ్లీ ప్రయత్నించాలి. రహస్యం తెలుకోమని రక్తం ఉద్రేకంతో పరుగులు తీస్తోంది.

అంతలో గూడూరు వచ్చింది. బండి ఆగింది. ఆకలి వేస్తోందనిపించడంవల్ల, చేతిసంచిలో మా అర్ధాంగి పొట్లాం కట్టిపెట్టిన మైసూరుపాకం ముక్కల్ని తీసి-మా ముందోక న్యూస్ పేపరు పరిచి అందులో పోశాను. లాయరుమిత్రుణ్ణికూడా వాటా పుచ్చుకో మన్నాను. ఆయన వద్దన్నాడు మొదట్లో. కాని మచ్చికచేసుకొని, మెల్లగా నాకు కావలసిన రహస్యాన్ని తెలుసుకోవాలని గదా, నా అభిలాష! అందువల్ల తినమని ఆయన్ని ఒత్తిడి చేశాను.

"రండి; తీసుకోండి."

"చాలండి. థాంక్స్."

"ఇవి తీసికెళ్ళి మీ ... మేనగోడలుకిచ్చి రండి" అన్నా నేను.

"అక్కర్లేదు. ఆవిడేదో తింటానికి తెచ్చుకుంది...కాని ఆమె మా మేనకోడలు కాదండి."

"ఓ...సారీ..."

ఇద్దరు మౌనంగా తినడం ప్రారంభించాం.

భార్య కాదు. చెల్లెలు కాదు. వదినెగారు కాదు. మేనకోడలు కాదు. బాగుంది ఒక్కొక్కరే కాదంటుంటే మనకెందుకులే అని అడగటం మానకుండా మొత్తానికి ముందడుగు వేస్తున్నానుగదా అని తృప్తిపడ్డాను. నాలో తళుకొత్తిన భావనాతరంగంపట్ల-చిన్నగా నవ్వుకుని మళ్లీ సంభాషణ కొనసాగించాను.

"మీరెందరు అన్నదమ్ములు?"

"ముగ్గురం" అన్నాడు నా లాయరు మిత్రుడు.

"మీరే పెద్దవారా?"

"కాదు. రెండోవాణ్ణి."

"ఆ కంపార్టుమెంటులో ఆవిడ మీ వదినగారా? ఆ...సారీ అన్నట్లు కాదన్నారు గదూ?...ఆమెగారు ఎందాకా వెళ్తున్నారు?

"మద్రాసు."

మొదటిసారి విమానంలో ప్రయాణం చేస్తున్న ఒకామె భయపడుతూ "ఇప్పుడు ఈవిమానం కూలితే ఎలా" అని అడిగింది.

విమాన చోదకుడు ఇలా అన్నాడు: "ఈ విషయంలో మీ రేమీ బెంగపెట్టుకోనక్కర్లేదు. మా యజమానికి ఇలాంటి విమానాలు బోలెడుఉన్నాయి."

—ఎమ్. వి. శ్రీనివాసరావు (నెల్లూరు-2)

అయితే. మళ్లీ మొదటకొచ్చింది వ్యవహారం. ఈ ప్రయత్నంకూడా విఫలమైంది. అసలు రహస్యం తెలుసుకొందామని ఎంత తాపత్రయపడుతున్నానో చివరికంతా దూరమైపోతున్నాను. తెలుసుకుని తీరాలనే ఆకాంక్ష, పట్టుదలా నాలో హెచ్చినై.

ఆయన కొంతదూరంనుంచీ మళ్లీ ఏ స్టేషన్లోనో దిగి ఆమె మంచి చెడ్డల్ని గురించి తెలుసుకొన్నట్లు జరగలేదన్న సంగతి నాకు స్ఫురణకొచ్చింది. కనుక ఆయనకో సూచన చేశాను.

"ఈ స్టేషన్లలో నీటికొరత బాగా ఎక్కువండీ త్రాగుదామంటే ఒక్కచుక్కన్నా నీళ్లు దొరకవు" అంటూ సంభాషణ మొదలు పెట్టాను.

"అవునండీ" అని తనకా సంగతి అదివరకే తెలుసునన్నట్లు బదులు పలికాడాయన.

"కొన్ని సందర్భాలలో నీటి ఎద్దడితోనే ప్రయాణం పూర్తి చేసుకోవాల్సి వస్తూ ఉంటుంది...చూశారా రాత్రి అయినా వడగాడ్పు ఎంత తీవ్రంగా ఉందో..."

అవునన్నట్లు తలూపాడు ఆయన.

"వచ్చేస్టేషను సూళ్ళూరుపేట. నీరు బాగానే దొరుకుతుంది. మీ అత్తగారికి మంచి నీళ్లేమైనా కావాలేమో వెళ్ళి కనుక్కోకపోయారా? ఒకవేళ దప్పిక ఉండొచ్చు."

"అలాగే...కాని, ఆమె మా అత్తగారు కాదండి."

"ఓ...సారీ..."

ఇంకో గంటన్నరలో మద్రాసు చేరుకోబోతున్నాము. నా ఆకాంక్ష పట్టుదల నెరవేరేట్లు లేదు. జీవితంలో ఇంత నిరాశ, ఇంతటి పరాజయం నేనెప్పుడూ ఎదుర్కోలేదు. ఇలాంటి చిఱు సంఘటనలే మానవజీవితాన్ని తారుమారు చేసేస్తుంటాయి. జీవితం ఈ ఓటమికి గురైతే ఇంక కొనసాగటం వృథా అనిపించింది.

అంతలో మళ్లీ ఆశ! ఇంకేదైనా దారి దొరుకుతుందేమో! అసలు స్త్రీ పురుషుల మధ్య సంబంధబాంధవ్యాలింతేనా? ఇంకేలాంటివీ లేవా?...ఏమో? నా మనస్సుకేం తట్టలేదు. బురదలో చేపల్ని పట్టినట్లు, మనస్సుకుతట్టే ఆలోచనల్నన్నీ కదిపి చూచాను, కాని ప్రయోజనం లేకపోయింది. సమస్య సమస్యగానే ఉండిపోయింది.

చిట్టచివరకు మద్రాసు దగ్గరకొచ్చినట్లు, ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ, వగైరా వర్కుషాపులన్నీ చూచి, ప్రయాణికులంతా పెట్టేబేడా సర్దుకోవడం మొదలుపెట్టారు.

"హమ్మయ్య...వచ్చేశాం" అన్నాడు లాయరు.

"ఆ!...బేసిన్ బ్రిడ్జిదగ్గర కొచ్చాం. ఈ మార్గ ప్రయాణాలు ఆడవాళ్ళకు మరీ కష్టమండీ, సెంట్రల్ స్టేషను ఎప్పుడొస్తుందా అని నిరీక్షిస్తాను. ఆగేసరికి మీ స్నేహితురాలు చాలా సంతోషిస్తుంది, ప్రయాణం ముగిసినందుకు—కదూ ?" వెంటనే అతడు నా వంక అదోరకంగా చూచాడు.

"అవునండీ. కాని ఆమె నా స్నేహితురాలు కాదు" అని ఖండిస్తున్నట్లు బదులు చెప్పాడు.

స్నేహితురాలుకూడా కాదనేసరికి నాకు కోపం వచ్చింది.

"ఎవరామె? నెల్లూరులో ఆమెను చూచిన దగ్గరనుంచీ ఆమె ఎవరని అడుగుతూ వచ్చాను. నువ్వు చెప్పడం లేదు. అవునా అని అడిగిందల్లా కాదంటున్నావు. ఎవరైందీ ఎందుకని చెప్పవు? మీ చెల్లెలు కాదు. భార్య కాదు, వదినెగారు కాదు, అత్తగారు కాదు...స్నేహితురాలంతకన్నా కాదన్నావు. ఎవరూ కాకపోతే...ఇంకెవరు?..." అని కోపాన్ని తమాయించుకుని నేను నయంగా, ఎంతో చనువు చేసుకుని అడిగాను. లాయరు తమాషాగా, చిఱునవ్వుతో జాలిగా, తానే విజయమొందినట్లు నావంక చూచాడు.

"కాని మీరు నన్నడిగారా? ఏదో ఊహాగానంలో ఏదేదో కలలుకంటున్నారు. తప్పటడుగు వేస్తున్నారు. దిద్దుతున్నాను. కాని ఇంతవరకు ఆమె ఎవరని ప్రత్యక్షంగా మీరసలు నన్నడిగారా?"


"లేదు. ఇప్పుడడుగుతున్నానండి..ఎవరామె?"

"మా మారుటి తల్లి" అని తన స్థానంలోనుంచి లేచి నుంచున్నాడు.

అరే!...అతని సమాధానం విని విస్తుపోయాను.

"నెల్లూరు స్టేషనులో మీరు ప్లాటుఫారం మీద తిరుగుతూ నేను మా అమ్మతో మాట్లాడుతూ ఉండగా చూచి, ఆమె ఎవరో అని ఆమెతో పరిచయంకోసం తాపత్రయపడి, నాచే పిలిపించుకోబడాలని అటూ ఇటూ ఎన్నిసార్లు పచార్లు చేశారో నేను గమనించకపోలేదు అలాగే, తర్వాత, కంపార్టుమెంటులో ఆ పేరున ఈ పేరున నన్ను మాట్లాడిస్తూ మా ఇద్దరిమధ్య అనుబంధమేమిటో తెలుసుకోవాలని పడిన తాపత్రయమూ అర్థం చేసుకున్నాను. ఎంతసేపూ—పరాయి స్త్రీని గురించి పగటి కలలు కనడం, పెడగా ఊహించడం, పెడగా అర్థం చేసుకోవడమే జరుగుతోందిగాని, మాతృమూర్తి అనే పవిత్రభావం మనసుకు ఊహామాత్రంగానైనా తోచకపోవడం శోచనీయం. నీరుపల్లమెరుగునన్న సామెతగా, మానవనైజం ఎంతసేపూ అల్పమైన ఆలోచనలకే ప్రాధాన్యమిస్తుంది గాని ఉదాత్తమైన భావనకు పూనుకోకపోవడం కుక్కతోక వంకర అన్న సామ్యానికి ప్రబల తార్కాణం" అని ఒక నీతి పాఠాన్ని నోరు పగలదీసి నోట్లో బలవంతంగా గరళంపోసినచందంగా, అభిమానం దెబ్బతిన్న నాకు బుద్ధిచెప్పుకుని బ్రతకమన్న హెచ్చరికగా—ఒక లెక్చరిచ్చేసరికి నేను తల వంచుకోక తప్పలేదు! ★


## తొలకరి చినుకులు




జ్ఞాపకమున్నదా—మండుటెండలకు మాడిపోయిన పిపాసపీడిత భూతలంబున తొలకరి చినుకులు వెల్లివిరిసిన సుమజాలంబు వగిది విరజల్లిన సుదినం ! ఆ వుదారశీతల తుషారధారలకు భూదేవి మనోల్లాసం పొంగి పొరలినది. అట్టి నిర్మల శీతల మనోల్లాసమును లక్మె టాల్కమ్ పౌడర్ వల్ల మీరనుదినంబును పొందగలుగుదురు. ప్రాతఃకాలపు స్నానానంతరం శరీర మంతటా లక్మె టాల్కమ్ పౌడర్ రాసుకొని రోజల్లా సువాసనతో హాయిగా ఉండగలరు.

సౌందర్యకర హిమబిందువు

# లక్మె

లక్మె ఒక టాటా ప్రోత్సాహితము

LKY-13T-TEL